Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 183 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 26 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015



## గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన కలెక్టర్

**గుంటూరు, (రాజధాని వార్తలు):** జిల్లాకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ చిన కొండ్రుపాడులో ఒక ప్రైవేట్ వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొనుటకు విచ్చేశారు. వైద్య కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# బీచ్ సాండ్ ఖనిజాలపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### - టైటానియం, రేర్ ఎర్త్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త దిశ : కొల్లు రవీంద్ర






**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌ను టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని గనులు, భూగర్భ వనరుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాలు రాష్ట్రానికి సహజ వరమని, వాటిని సమర్థవంతంగా వినియోగిస్తే భారీ పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. ఖనిజాలను తవ్వి ఎగుమతి చేసే దశను దాటుకుని, రాష్ట్రంలోనే శుద్ధి, ప్రాసెసింగ్, తుది ఉత్పత్తుల తయారీ వరకు పూర్తి విలువ పెంపు గొలుసును నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ నోవోటెల్‌లో "బీచ్ సాండ్ ఖనిజాల నుంచి టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, శాశ్వత అయస్కాంతాలు – ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విలువ పెంపు గొలుసుల నిర్మాణం: అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి కొల్లు మాట్లాడుతూ, టైటానియం, రేర్ ఎర్త్ పదార్థాలు రక్షణ, అంతరిక్ష, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలకు కీలకమని వివరించారు. భవిష్యత్ సాంకేతిక రంగాలన్నీ ఈ వ్యూహాత్మక ఖనిజాలపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు స్పష్టమైన విధానం, వేగవంతమైన అనుమతులు, భూకేటాయింపులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టైటానియం, రేర్ ఎర్త్ పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు డా.జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా టైటానియం, రేర్ ఎర్త్ మాగ్నెట్లకు భారీ డిమాండ్ పెరుగుతోందన్నారు. రక్షణ, అంతరిక్ష, క్షిపణి సాంకేతికత, అధునాతన ఇంజినీరింగ్ రంగాల్లో ఈ పదార్థాల ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా దిగుమతులపై ఆధారపడకుండా దేశం ముందుకు సాగగలదన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా లభించే బీచ్ సాండ్ ఖనిజాలను సాంకేతిక పరిజ్ఞానంతో విలువ పెంచితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడే స్థాయికి చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని సతీష్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (గనులు) ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, దీర్ఘకాలిక ఖనిజ సరఫరా భద్రతతో పాటు పరిశ్రమలకు అనుకూల విధాన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సింగిల్ విండో వ్యవస్థ ద్వారా వేగవంతమైన అనుమతులు, పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాల వినియోగంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వం, స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని ముఖేష్ కుమార్ మీనా భరోసా ఇచ్చారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ, పెట్టుబడిదారులకు ఎంతో అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక పార్కులు, పోర్ట్ కనెక్టివిటీ వంటి అంశాలు ఆంధ్ర ప్రదేశ్‌కు ఉన్న బలాలని చెప్పారు. వేగవంతమైన నిర్ణయాలతో పరిశ్రమలు త్వరగా స్థాపన దశకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశ్రమల వాతావరణాన్ని రాష్ట్రంలో ఏర్పరచేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలోకి ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఏపీఎండీసీ వైస్ చైర్మన్, ఎండీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గుర్తించిన బీచ్ సాండ్ ఖనిజ నిల్వలు పరిశ్రమలకు దీర్ఘకాలిక ముడి సరుకు భద్రతను అందిస్తాయని తెలిపారు. శాస్త్రీయ తవ్వకాలు, సమర్థవంతమైన ఖనిజ వేరు చేసే యూనిట్లు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముడి ఖనిజాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వరకు ఏపీఎండీసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఖనిజ అన్వేషణ విస్తరణతో పాటు సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. బాధ్యతాయుత తవ్వకాలతో పాటు పారదర్శకతను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో నిపుణుల ప్యానల్ చర్చలు, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేయనుంది.

# మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టీకల్చర్ రైతుల జీవితాల్లో కళకళ కార్యక్రమంలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

### - వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం









**మార్కాపురం, (రాజధాని వార్తలు):** గత పాలనలో రాష్ట్రం విధ్వంసమైంది. పునర్నిర్మాణం కోసం ఎన్నికల్లో మీ సహకారం కోరాను. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పడి మీ ఆశీస్సులు అందుకున్నాం. గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అఖండ విజయం కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకూ ఒక్కసీటు కూడా వాళ్లకు రాలేదు. వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వందశాతం గెలిపించండి. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బంది తొలగిస్తూ మార్కాపురం ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నాం. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశాం. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ పూర్తి చేసి నీరసిస్తాం. గతంలో ఈ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశాను. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి నాకే అవకాశం వచ్చింది. 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు. వెలిగొండ పనులు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయి. గతంలో నేను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లం. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడు. కానీ ప్రజలెవరూ అతన్ని నిలదీయలేదు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బను కట్ చేసి మోసం చేశాడు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరం. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావా రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం.

ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయి.

# నంది నాటక బహుమతులు - 2025, కందుకూరి ప్రతిష్టాత్మక, విశిష్ట పురస్కారాలు - 2026కు దరఖాస్తుల ఆహ్వానం

### - రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నంది నాటక బహుమతులు-2025' మరియు 'కందుకూరి ప్రతిష్టాత్మక, విశిష్ట పురస్కారాలు-2026' కు అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంది నాటక బహుమతులు 2025కు తెలుగులో రచించిన పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు/నాటికలు, బాలల నాటికలు, కళాశాల/విశ్వవిద్యాలయాల నాటికలు, నాటకరంగంపై రచించిన పుస్తకాల విభాగాల్లో దరఖాస్తులను నాటక సమాజాలు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వ్యక్తుల నుండి దరఖాస్తులను కోరుచున్నామన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు 178వ జయంతిని పురస్కరించుకుని, ఏప్రిల్ 16న నాటకరంగ దినోత్సవం సందర్భంగా నాటక రంగంలో అత్యుత్తమ సేవలందిస్తున్న రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో ఉత్తమ కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, దర్శకులకు విశిష్ట పురస్కారాలను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. గతంలో రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న వారు దరఖాస్తుకు అనర్హులని, అయితే గతంలో జిల్లా స్థాయి పురస్కారం పొందిన వారు రాష్ట్ర స్థాయి పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు సంస్థ అధికారిక వెబ్‌సైట్ www.apsftvtdc.in నుండి



దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు, ప్రింట్ తీసిన దరఖాస్తులను, సంబంధిత పత్రాలను కార్యాలయంలో సమర్పించడానికి చివరి తేదీ మార్చి 26, 2026 అని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఏపీ స్టేట్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ప్రాంగణం, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, 4వ అంతస్తులో నేరుగా అందజేయాలని రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కెఎస్ విశ్వనాథన్ ఆ ప్రకటనలో తెలిపారు.

# జీతాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన




**అమరావతి, (రాజధాని వార్తలు):** నేలపాడు ఎన్‌జీఓ టవర్స్ వద్ద షాపూజీ – పల్లోంజి నిర్మాణ సంస్థ కార్మికుల ఆందోళన. 5 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని..వెంటనే చెల్లిచాలని డిమాండ్.



జీతాలు చెల్లిస్తేనే.. పనులు చేస్తామంటున్న కార్మికులు కార్మికులతో చర్చలు జరుపుతున్న యాజమాన్య మధ్య వర్తిత్వం.. తుళ్లూరు సీఐ కొంకా. శ్రీనివాసరావు. మీడియాను లోపలికి అనుమతించని సెక్యూరిటీ.

# "జగన్ రాక మాకెంతో పండుగ - కాకాణి"









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గం, కనుపర్తి పాడు జిల్లా పరిషత్ పాఠశాలలో, నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డితో కలిసి హెలిపాడ్‌ను పరిశీలించిన మాజీ మంత్రి వర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు "కాకాణి గోవర్ధన్ రెడ్డి. ఈ నెల 26వ తేదీ మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నెల్లూరుకి రానున్న సందర్భంగా హెలిపాడ్‌ను పరిశీలించి, ఏర్పాట్లను సమీక్షించిన కాకాణి. జగన్ మోహన్ రెడ్డి రాక కోసం, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఫిబ్రవరి 26వ తేదీ గురువారం నెల్లూరు రాక సందర్భంగా, ఘనంగా స్వాగతించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జగన్ మోహన్ రెడ్డి 26 తేది ఉదయం 10 గంటలకు హెలికాప్టర్ లో నెల్లూరుకి చేరుకొని వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి రోడ్డు మార్గాన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొంటారు, తిరిగి 11.00 గంటలకు తిరుగు ప్రయాణం అవుతారు... జగన్మోహన్ రెడ్డి నెల్లూరుకు వస్తున్నారంటే వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యక ర్తలలో ఉత్సాహం నిండుకుంది... జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి, జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సంబందించిన అన్నీ అనుమతులు తీసుకున్నాం...గతంలో పోలీసులు నామమాత్రంగా ఉండటం వల్ల ఎవరంటే వారు రావడం, గందరగోళం వంటివి జరిగాయి. ఈసారి అలా జరగకుండా పోలీస్ వారు జాగ్రత్తలు తీసుకోవాలి... జగన్ మోహన్ రెడ్డి కేటగిరీ భద్రతలో ఉన్నందున, గతంలో జరిగిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీని కోరాం...డీఎస్పీ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఇస్తామని తెలిపారు... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ కలిసి చర్చించుకుని, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం...జగన్ మోహన్ రెడ్డి పర్యటన సమయంలో పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు చాలా క్రమశిక్షణతో ఉండాలని విన్నపం చేస్తున్నాం...జగన్ మోహన్ రెడ్డికి ఉత్సాహంగా స్వాగతం పలకాలి కానీ, అతి ఉత్సాహానికి పోయి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకూడదని తెలియజేస్తున్నా...జగన్మోహన్ రెడ్డి పర్యటనలో సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు జాగ్రత్త వహించాలి...జగన్మోహన్ రెడ్డికి ఎటువంటి భద్రతాపరమైన ఇబ్బందులు కలగకుండా, పోలీసు వారు పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంపూర్ణంగా సహకరించాలి...భారీ జనసందోహం ఉన్నప్పటికీ, ఎక్కడా ఒక చిన్న పొరపాటు కూడా జరగకుండా పోలీస్ వారు చూడాలి, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరు విచ్చేసి జగన్మోహన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుదాం...

# దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ ఎక్స్‌పో

# 'ఎస్ఏటిటిఇ'లో మెరిసిన ఏపీ పర్యాటక రంగం

### - ఢిల్లీ 'యశోభూమి'లో ఏపీ టూరిజం స్టాళ్లకు విశేష స్పందన
### - జాతీయ, అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లతో ఏపీ ప్రతినిధుల బృందం భేటీ - రాష్ట్ర పర్యాటక రంగానికి గ్లోబల్ బ్రాండింగ్ కల్పించడమే లక్ష్యం




**అమరావతి/న్యూఢిల్లీ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో న్యూఢిల్లీలోని 'యశోభూమి'లో ఫిబ్రవరి 25 నుండి 27 వరకు జరుగుతున్న దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్‌లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతినిధుల బృందం చురుగ్గా పాల్గొన్నది. రాష్ట్ర పర్యాటక శాఖ తరపున డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొని ఏపీ పర్యాటక రంగానికి సంబంధించిన విశేషాలను ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరించారు. ఏపీ పర్యాటక శాఖ స్టాళ్లలో రాష్ట్రంలోని ప్రముఖ ట్రావెల్ మరియు హాస్పిటాలిటీ సంస్థలు తమ సేవలను ప్రదర్శించాయి. ఇందులో విశాఖపట్నం నుండి ప్రవాసిన్, ట్రెక్ సమ్, హాలిడే వరల్డ్, రాడిసన్ బ్లు రిసార్ట్‌లు, తిరుపతి నుండి బృందావన్ హాలిడేస్, స్టార్ లెట్ స్యూట్, న్యూఢిల్లీ నుండి ఈజ్ మై ట్రిప్ తదితర ప్రముఖ సంస్థలు భాగస్వాములయ్యాయి. ప్రధానంగా రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లను నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్ టూర్ ఆపరేటర్లతో అనుసంధానం చేయడం ద్వారా పర్యాటక నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం లక్ష్యంగా ఏపీ బృందం తమదైన ప్రదర్శన చేసింది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, అరకు లోయ, గండికోట, ఆధ్యాత్మిక క్షేత్రాలైన తిరుపతి, విజయవాడ, శ్రీశైలం వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తోంది. వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించేలా తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న ప్యాకేజీలను టూర్ ఆపరేటర్ల ద్వారా రూపొందించడం వంటి అంశాలను ఈ బృందం చర్చించింది. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిన నేపథ్యంలో ఈ సదస్సు ఇన్వెస్టర్లను ఆకర్షించడానికి వేదికగా నిలిచింది. పర్యాటక శాఖ రూపొందించిన '2024-29 నూతన పర్యాటక పాలసీ' గురించి ఇక్కడి ప్రతినిధులకు వివరించారు. దీనివల్ల రాబోయే రోజుల్లో ఏపీకి మరిన్ని విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ బ్రాండ్‌ను అంతర్జాతీయ వేదికపై పెంపొందించడమే తమ లక్ష్యమని, SATTE వంటి వేదికల ద్వారా ఏపీ రాష్ట్ర పర్యాటక సంపదను ప్రపంచానికి చూపిస్తున్నామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలుస్తుందని ఏపీ పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటల నేతృత్వంలో రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పర్యాటక సదస్సుల్లో పాల్గొని ఏపీ టూరిజాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఏపీటీఏ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న టూర్ ఆపరేటర్స్‌కి న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ సదస్సులో ఏపీ పెవిలియన్ తరపున పాల్గొనే అవకాశం లభించడమే గాక జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీస్‌ను కలిసే అవకాశం దొరకడం విశేషం.. తద్వారా వారి సేవలు మరింత విస్తరించేందుకు వీలు కలుగుతుంది.. ఈ నేపథ్యంలో ఏపీటీఏ పోర్టల్‌లో టూర్ ఆపరేటర్లు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి ఈ అవకాశం కలుగుతుందని అధికారులు వెల్లడించారు.

# బసినేనిపల్లిలో టీడీపీకి అంతర్గత మంటలు...కార్యకర్తల్లో ఆగ్రహం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బసినేనిపల్లి పంచాయితీలో తెలుగు దేశం పార్టీలో అంతర్గత అసంతృప్తి బహిరంగంగా బయటపడుతోంది. ఏళ్ల తరబడి పార్టీ కోసం చెమటోడ్చిన సీనియర్ నాయకులను పక్కనబెట్టి కేవలం ఇద్దరికే ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యకర్తలు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీకి గట్టిగా ఎదురు నిలబడి, పార్టీ జెండాను ఎగరవేసిన నాయకులు ఇప్పుడు గుర్తింపే లేకుండా పోయారనే ఆవేదన వ్యక్తమవుతోంది. "పంచాయితీలో పార్టీ కోసం కష్టపడింది వాళ్ళిద్దరేనా? మిగతా నాయకులు లేరా?" అంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. మండల నాయకత్వం ఎందుకు ఇద్దరినే ముందుకు తెస్తోంది? సీనియర్ల అనుభవం, పాత కార్యకర్తల త్యాగాలు విలువలేనివేనా? అనే చర్చ జోరుగా సాగుతోంది. స్థానికంగా ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారగా, పార్టీ ఉన్నత నాయకత్వం జోక్యం చేసుకుని అందరినీ కలుపుకుని వెళ్లాలనే డిమాండ్ వినిపిస్తోంది. లేదంటే ఈ అసంతృప్తి భవిష్యత్తులో పార్టీకి నష్టమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

# నెల్లూరు జిల్లాలో మైనింగ్‌లో జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ మేయర్ పోట్లూరు స్రవంతి భర్త జయవర్ధన్ నెల్లూరు ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. రూప్ కుమార్ యాదవ్ తన అవినీతిపై మూలా పేట శివాలయం వద్ద ప్రమాణంకి సిద్ధమా...రూప్ కుమార్‌కు నేను సవాల్ విసురుతున్న స్రవంతి మేయర్‌గా వున్నప్పుడు అభివృద్ధికి అడ్డుపడుతున్నారు అన్న మాట నిరూపించగలరా... ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ను ఉద్దేశించి కుర్చీ కుమార్ అంటూ తీవ్ర విమర్శలు చేశారు...రూప్ కుమార్ యాదవ్ మేయర్ కుర్చీ పోయిందని ప్రెస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నాడు...రెండు నెలల్లో నెల్లూరులో కోట్ల రూపాయలు అభివృద్ధి చేసాను అని చెప్పాడు ఒక పని చేయాలన్నా మొదలు పెట్టాలి అన్నా దానికి ఒక పద్ధతి ఉంటుంది రెండు నెలల్లో కోట్లు అభివృద్ధి ఎక్కడ చేశాడు చూపాలి..నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో రూప్ కుమార్ యాదవ్ మైనింగ్‌లో తీవ్ర అక్రమాలకు పాల్పడుతున్నాడు..రూప్ కుమార్ యాదవ్ తన అక్రమ మైనింగ్ కోసం హబీబ్ బాషా అనే సర్వేయర్ సంతకం ఫోర్జరీ చేశారు...అక్రమాలకు, అవినీతికి, మాఫియాకు ఐఎస్ఐ బ్రాండ్ రూప్ కుమార్ యాదవ్...ఫోర్జరీ సంతకాలు నా చేత చేయించింది రూప్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి...పద్మావతి మైన్, శ్రీనివాస మైన్ వారికి 20 కోట్లు ఇస్తా అని కోటి రూపాయలు ఇచ్చి వేల టన్నులు క్వార్జ్ అక్రమ వ్యాపారంతో వందల కోట్లు రూపాయలు దోచుకున్నారు...మూలా పేటలో 20 కోట్లు రూపాయలతో ఇళ్లు, వందల కోట్లు రూపాయలు ఆస్తులు రూప్ కుమార్‌కు ఎలా వచ్చాయి...కావలి సమీపంలో 60 కోట్ల రూపాయలు క్వార్జ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ కొన్నారా లేదా. ఎన్నో ఏళ్ళుగా మైనింగ్ చేస్తున్న మైనింగ్ వ్యాపారాలు పై చైనా వ్యాపారుల్లో ఉన్న నమ్మకం క్వాలిటీ లేని క్వార్జ్ చైనాకు పంపి రూప్ కుమార్ యాదవ్ క్వార్జ్ మార్కెట్‌ను చెడగొట్టాడు..చైనాలో మేయర్ ఆఫ్ నెల్లూరు అని పెట్టుకుని చైనీయులనే బురిడి కొట్టించిన ఘనత రూప్ కుమార్‌ది. డౌ అనే చైనా వ్యక్తిని తీసుకు వచ్చి దేశ చట్టాలుకు వ్యతిరేకంగా నెల్లూరు హోటల్‌లో ఉంచి జిల్లా అంతా మైనింగ్ కోసం తిప్పాడు రూప్...డౌ అనే చైనా వ్యక్తిని మొలకల పుండ్లకు తీసుకు వచ్చి క్వార్జ్ క్వాలిటీ టెస్ట్ చేయించిన రూప్. దేశంలోకి ఇతర దేశాల వాళ్ళు వస్తే కొన్ని చట్టాలు ఉంటాయి, వాటిని డౌ అతిక్రమించాడు...దేశ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన రూప్ కుమార్‌పై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలి.. మైనింగ్‌లో ఎందరినో బెదిరించి రూప్ కోట్లు రూపాయలు దోచుకున్నాడు. జిల్లాలో అతిపెద్ద కుంభకోణానికి రూప్ ఆద్యుడు, ఓ భారీ కుంభకోణానికి అనుమతులు తీసుకున్నాడు.. మైనింగ్ మాఫియా పై ప్రభుత్వం లోతైన దర్యాప్తు చేయాలి...మంత్రి నారాయణ, ఎంపి,జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ అందరి పేర్లు వాడుకుని అటవీ భూములు దోచేందుకు సిద్ధం అయ్యారు...రూప్ ఉదయం శివాలయంలో పూజలు చేసి సాయంత్రానికి దేవుడిని దోచుకుంటాడు.

# ఉప ముఖ్యమంత్రితో వెంకటగిరి ఎమ్మెల్యే భేటీ

### - అభివృద్ధి అజెండాతో అమరావతిలో కీలక చర్చలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శాసనసభ సమావేశాల విరామ వేళ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైన భేటీ చోటు చేసుకుంది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై సమగ్ర నివేదికను అందజేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకటగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దేవాలయాల రహదారులకు అటవీ అనుమతుల మంజూరును వెంకటగిరి కోడూరు రహదారి పునరుద్ధరణ, విస్తర సాగునీటి ప్రాజెక్టుల వేగవంతం. విద్యా, ఆరోగ్య మౌలిక సదుపాయాల మెరుగుదల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల బలోపేతం. ఈ అంశాలపై శాఖల మధ్య సమన్వయం లోపిస్తోందని, పరిపాలనా అనుమతులు ఆలస్యం అవుతున్నాయని ఎమ్మెల్యే వివరించినట్లు సమాచారం.

**నిధులు - అనుమతులపై స్పష్టత**

కొన్ని అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచిపోయిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆ అంశాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పెండింగ్ ఫైళ్లకు తక్షణ అనుమతులు ఇవ్వాలని, సంబంధిత శాఖలకు మార్గదర్శకాలు జారీ చేయాలని కోరినట్లు సమాచారం. ఎమ్మెల్యే సమర్పించిన విజ్ఞప్తులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వీకరించి, అంశాల వారీగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. సమస్యల పరిష్కారంలో సమన్వయ దృక్పథంతో ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. వ్యవసాయాధారిత ప్రాంతమైన వెంకటగిరిలో నీటిపారుదల సమస్యలు, రైతు ఇబ్బందులు అత్యంత ప్రాధాన్య అంశాలుగా నిలుస్తున్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక ప్రోత్సాహం, స్వయం ఉపాధి పథకాల అమలు వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. శాసనసభ వేదికపైనే కాకుండా నేరుగా ప్రభుత్వ పెద్దలను కలిసి చర్చించడం ద్వారా అభివృద్ధి పనులకు వేగం వచ్చే అవకాశముందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. ఈ భేటీతో వెంకటగిరి అభివృద్ధి పనులకు కొత్త ఊపు దక్కుతుందా? ప్రజల ఆశలు నెరవేరుతాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

# సాధారణ కోవిడ్, కుటుంబ వంటి సర్వేల కన్నా జనగణన-2027 సర్వే రాజ్యాంగబద్ధమైంది

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సాధారణ కోవిడ్, కుటుంబ వంటి సర్వేల కన్నా జనగణన-2027 సర్వే రాజ్యాంగబద్ధమైనదని, దానిని క్రమ పద్ధతిలో, అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక హరనాధపురంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో 24/02/2026 నుండి 26/02/2026 వరకు జిల్లా అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో అందరూ శ్రద్ధగా జన గణన ప్రక్రియపై అవగాహన పొందాలన్నారు. జనగణన-2027 ముఖ్యంగా రెండు పేజ్‌లలో నిర్వహించడం జరుగుతుందని తొలి విడతలో హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ఉంటుందని, రెండవ విడతగా జనగణన ఉంటుందన్నారు. ప్రతి 10 సంవత్సరములకు ఒకసారి గణన జరుగుతుందని, 2011 తరువాత ఇప్పుడు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సర్వీసులో చేరేటప్పుడు ఎన్నికలు, వి.ఐ.పి పర్యటనలలో విధులు నిర్వహించాలని ఉంటుందని తెలిపారు. 2011 జరిగిన జన గణన సమయంలో తానూ ప్రయివేటు ఉద్యోగంలో ఉన్నానన్నారు. తానూ తొలిసారి జనగణనలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జనగణన వల్ల ప్రభుత్వ స్కీములు అందవనే అపోహ ప్రజలలో ఉందని, ఇది కేవలం జనగణన మాత్రమె అని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు ఆనందవనే అపోహ అవసం లేదన్నారు. జన గణన నిర్వహించడం ద్వారా కొత్త గ్రామాలు, కొత్త మునిసిపాలిటీలు ఏర్పడతాయన్నారు.ఇది వ్యక్తిగతం కాదని తెలిపారు. జనగణన ప్రక్రియను సమర్ధవంతముగా అన్ని శాఖల సమన్వయ సహకారంతో, జాగరూకతతో నిర్వహించాలని తెలిపారు. ఇది చాలా ముఖ్యమైన పాలసీ అని తెలిపారు. దీని ద్వారా అభివృద్ధికి బాటలు ఏర్పడతాయని అన్నారు. నెల్లూరు జిల్లా అన్ని రంగాలలో 5వ స్థానంలో ఉన్నదని, జనగణనలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని పిలుపునిచ్చారు. శిక్షణకు హాజరు కాని అధికారులకు శిక్షణ వివరాలను తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జనగణన సహాయ సంచాలకులు శ్రీనివాస రావు జనగణన-2027 పై విపులంగా వివరించారు.

# విక్రమ సింహపురి వర్సిటీలో ముగిసిన ఐఎస్ఓ తనిఖీలు

## - నాణ్యతా ప్రమాణాలపై నిపుణుల ప్రశంసలు... ఐదు సర్టిఫికేషన్లకు అర్హత







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక Vikrama Simhapuri University (VSU)లో అంతర్జాతీయ ప్రమాణాల ధృవీకరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన రెండు రోజుల సమగ్ర తనిఖీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. రెండో రోజు తనిఖీల్లో భాగంగా ఐఎస్ఓ నిపుణుల బృందం విశ్వవిద్యాలయంలోని విద్యా, వసతి మరియు పరిపాలనా విభాగాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించింది. వసతి గృహాల్లో సౌకర్యాల పరిశీలన తనిఖీ బృందం సభ్యులు పినాకిని పురుషుల వసతి గృహం, కైవల్లే మహిళల వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యాలు, తాగునీటి శుద్ధత, గదుల పరిశుభ్రత మరియు భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. ముఖ్యంగా రికార్డుల నిర్వహణ విద్యార్థుల హాజరు పట్టికలు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఇవన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యా విభాగాల పనితీరుపై సమీక్ష బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, సోషల్ వర్క్, ఫిజిక్స్ విభాగాలను సందర్శించిన బృందం అక్కడి బోధనా పద్ధతులు పాఠ్య ప్రణాళికలు ప్రయోగశాలల సదుపాయాలు విద్యార్థుల మూల్యాంకన విధానం పరిశోధన పత్రాల నమోదు డాక్యుమెంటేషన్ విధానం వివరంగా పరిశీలించింది. విద్యా నాణ్యత పరిరక్షణలో విశ్వవిద్యాలయం కట్టుబాటును బృందం ప్రశంసించింది. పరిపాలనా విభాగాల్లో పారదర్శకత ఎస్టాబ్లిష్మెంట్, ఫైనాన్స్, పర్చేజ్ మేనేజ్‌మెంట్, సిడిసి, అకాడమిక్ సెక్షన్, ఎన్ఎస్ఎస్ మరియు IQAC విభాగాల్లో ఫైళ్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత, కొనుగోలు విధానాలు, నాణ్యత నియంత్రణ చర్యలు కూా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని బృందం అభిప్రాయపడింది. ఐదు ఐఎస్ఓ సర్టిఫికేషన్లకు అర్హత తనిఖీల అనంతరం జరిగిన ముగింపు సమావేశంలో HYM International Certifications Pvt. Ltd. ప్రతినిధులు తమ ప్రాథమిక నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, పరిపాలనా పారదర్శకత మరియు పర్యావరణ–శక్తి నిర్వహణ విధానాలను సమగ్రంగా సమీక్షించిన అనంతరం, వర్సిటీకి ఐదు అంతర్జాతీయ ఐఎస్ఓ సర్టిఫికేషన్లు ప్రదానం చేయాలని సర్టిఫికేషన్ బాడీ నిర్ణయించింది. ఇది విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. అభివృద్ధికి సూచనలు మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య అలపాటి, రిటైర్డ్ జిల్లా జడ్జి టి. సుందర్ రామయ్య మరియు ఇతర ఆడిటర్లు మరిన్ని మెరుగుదలకు కొన్ని నిర్మాణాత్మక సూచనలు చేశారు. వర్సిటీ అధికారులు స్పందిస్తూ సూచించిన మార్పులను త్వరితగతిన అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్. విజయ, IQAC డైరెక్టర్ ఆచార్య అందే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు డా.ఎం.హుస్సేనయ్య, డా.సి.హెచ్. వెంకటరాయులు తదితర విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

సారాంశం:

ఐఎస్ఓ తనిఖీలు విజయవంతంగా పూర్తి కావడంతో పాటు ఐదు సర్టిఫికేషన్లకు అర్హత సాధించడం ద్వారా వర్సిటీ నాణ్యతా ప్రమాణాల సాధనలో కీలక ముందడుగు వేసింది.

# "నోరు జాగ్రత్త - మనుబోలు వైఎస్ఆర్ సీపీ నాయకులు"






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం, మనుబోలు మండలంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు... చర్మం తీసేస్తాం జాగ్రత్తా .. శివుడు రాజా గౌడ్‌కి, భాస్కర్ గౌడ్ హెచ్చరిక. వైఎస్ఆర్ సీపీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ గౌడ్ కామెంట్స్.

కాకాణిని అడ్డగోలుగా విమర్శిస్తే, చర్మం వలిచేస్తాం. ఇప్పటివరకు ఎందుకు లే అని అనుకుంటే రెచ్చిపోతున్నావు నువ్వు.. నీ తోలు తీస్తాం ఖబర్దార్. మీ బ్రతుకులు ఏందో ఒకసారి వెనక్కి వెళితే, ఎక్కడో ఓజిలి మండలం, వెంకటరెడ్డి పాలెం గ్రామంలో నీ తండ్రి ఇదేవిధంగా చేస్తుంటే కట్టేశారు తన్నితే, గూడూరు నుండి కొంత మంది నాయకులు వెళ్లి విడిపించుకోవచ్చారు... మీ సొంత గ్రామంలో బ్రతకలేక, బతుకుదెరువు కోసం మనుబోలు కొచ్చి, ఇక్కడ పిచ్చి, పిచ్చి రాజకీయాలు చేస్తామంటే నీ చర్మం పెరికేస్తాం గుర్తుపెట్టుకో. రాజా గౌడ్ నీ గతాన్ని తెలుసుకొని మాట్లాడు, మా నాయకుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని మాట్లాడే స్థాయి నీకుందా. మీడియా సమావేశంలో చెయ్యి ఇలా పెట్టి చూపిస్తావా, నీకు మదం పట్టి అల్లాడుతున్నావు, నీ మదం మొత్తం దించేస్తాం. కాకాణి గోవర్ధన్ రెడ్డి అంటే ఏమిటో తెలుసా నీకు, రాజకీయాలలో అజాతశత్రువు, అసమానీయుడు. 24 గంటలు మనసంతా ప్రేమతో నిండిన మహా శక్తిపరుడు ,రాజకీయాలలో అలుపెరగని పోరాట యోధుడు గోవర్ధన్ రెడ్డి. అటువంటి మహనీయుడిని తూలనాడే స్థాయా నీది, పెద్దలను గౌరవించడం నేర్చుకో, గౌరవం నేర్చుకుంటే ఈ గ్రామంలో బ్రతకగలవు, లేకపోతే ఇక్కడ బ్రతకలేవు జాగ్రత్త. వీడు సర్వేపల్లి యువత అంట గోవర్ధన్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తాడంట, నీలాంటివారిని ఎంత మందిని చూసుంటాడు. గోవర్ధన్ రెడ్డి ఎక్కడ, నువ్వు ఎక్కడ, ఆయనకి, నీకు నక్కకి నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంది. గౌడ్ కులంలో చెడపుట్టావు, ఈరోజు నుండి జాగ్రత్తగా మసులుకో మరోసారి ఇలా మాట్లాడితే నీకు పుట్టగతులు ఉండవు. మీ ప్రభుత్వం ఉందని విర్రవీగవద్దు, అనవసరంగా హద్దు మీరి మాట్లాడితే ప్రతి పక్షంలో ఉన్నా, వైఎస్ఆర్సిపి నేతల సత్తా ఏంటో నీకు చూపిస్తాం. రాజా.. నువ్వు గోవర్ధన్ రెడ్డి ఎడమ గోరు వెంట్రుకగా కూడా పనికి రావ్ నువ్వు, నీ స్థాయి తెలుసుకొని మసులుకో. గోవర్ధన్ రెడ్డి అచెంచలమైన నాయకుడు, పేద ప్రజల కోసం పాటుపడే మహోన్నత వ్యక్తి. ఆంధ్ర రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అడుగు జాడల్లో నడిచే నాయకుడు,గోవర్ధన్ రెడ్డి. మా నాయకుడు జోలికొస్తే మేమే నీకు బుద్ధి చెబుతాం, ఖబర్దార్....

మండల కన్వీనర్ హరి గోపాల్ రెడ్డి కామెంట్స్:

టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై విచారణకు, చర్చకు, ఎక్కడికైనా వచ్చేందుకు మేము సిద్ధం, మీరు సిద్ధంగా ఉన్నారా. మా నాయకుడు పనులు చేయకుండా దొంగ బిల్లులు చేసుకునే విధానం మాకు నేర్పించలేదు...ఎవరి సంతోషం కోసమో కొందరు నాయకులు దుర్మార్గంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదు, మాట్లాడేటప్పుడు నోరు పదుపులో పెట్టుకుంటే మంచిది. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో ఈర్ష్య, విద్వేషాలు రెచ్చగొట్టేందుకే టిడిపి నాయకులు ప్రెస్ మీట్‌లు పెట్టి మాట్లాడుతున్నారు.. పగ ప్రతీకారాలు తీర్చుకునేందుకు ఇలాంటి ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడితే, మేము సిద్ధంగా ఉన్నాం తేల్చుకుంటాం. మా నాయకుడు ఇంటిని ముట్టడిస్తానని మాట్లాడారు, దమ్మూ, ధైర్యం ఉంటే రండి ఎవరు వస్తారో మేము చూస్తాం, మేము సిద్ధంగా ఉన్నాం. పోలీసులు లేకుండా వస్తే మీ సత్తా ఏంటో, మా సత్తా ఏంటో తేల్చుకుందాం...తిరుమల శ్రీవారి లడ్డుపై చేసిన విషప్రచారంతోనే కూటమి నాయకుల పతనం ప్రారంభమైంది. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి స్థాయికి నుండి క్రింది స్థాయి నాయకుల వరకు దుష్ప్రచారం చేసి ఏమి లాభం, ప్రజలు చెవుల్లో పూలు పెట్టుకోలేదు, వారికి అన్నీ తెలుసు...కూటమి నాయకుల పాపాల పుట్ట త్వరలోనే బద్దలవుతుంది. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించారు.

ఎప్పటి నుండో అభివృద్ధికి నోచుకోని గిరిజన కాలనీలో పడరాని అవస్థలు పడుతుంటే కాలనీలో సిసి రోడ్లు వేసిన ఘనత మా నాయకుడు గోవర్ధన్ రెడ్డిది. గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించాడు, కూటమి ప్రభుత్వం వచ్చి 20 నెలలు అవుతుంది, గ్రామాలలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా, చూపించగలరా. ఇకనైనా కూటమి నాయకులు మాటలు కట్టిపెట్టి, అభివృద్ధి మీద దృష్టి పెడితే మంచిది. మా నాయకుడు మీద అవాకులు చవాకులు పేలితే, నార తీస్తాం.

చంద్రశేఖర్ రెడ్డి కామెంట్స్ :

టిడిపి నాయకులు మీద ఉన్న అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మీడియా సమావేశంలో మా మీద బురద చల్లాలని చూస్తున్నారు తప్ప, గడిచిన 20 నెలలలో వాళ్లు ఏమి చేశారో ప్రజలకు చెప్పుకోలేకపోతున్నారు. గ్రామాలలో ఎక్కడకి వెళ్లినా గత ప్రభుత్వంలో గోవర్ధన్ రెడ్డి వేయించిన సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్లు, జగనన్న కాలనీలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ సెంటర్‌లు, నాడు నేడు ద్వారా స్కూల్స్ రూపరేఖలు మార్చేశారు, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసిన మా నాయకుడి మీద బురద చల్లాలనుకోవడం మీ అవివేకం... కూటమి నాయకులు గ్రామాల్లో ఏమి చేశారో చెప్పగలరా, కనీసం చూపించగలరా మీరు చేసే అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు బయటపడకుండా కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు తప్ప, అభివృద్ధి చేసింది శూన్యం. మీరు అభివృద్ధి చేయలేక గోవర్ధన్ రెడ్డి మీద అసత్యాలు మాట్లాడితే ప్రజలు ఎవరు హర్షించరు. కూటమి నాయకులకు దమ్ము, ధైర్యముంటే ప్రజల్లోకి వెళ్లి మీకు ఫలానా అభివృద్ధి, సంక్షేమం చేశామని చెప్పగలరా. అధికార గర్వంతో మా నాయకుడి మీద అకారణంగా మాట్లాడితే మీ అంతు చూసేందుకు వెనకాడం జాగ్రత్త.

తులసి రామ్ కామెంట్స్ :

మీకు సిగ్గూ, శరం ఉంటే సీనియర్ నాయకులమని చెప్పుకునే వారు కండలేరులో ఉన్న నీరు కాగితలపూరు గ్రామానికి తెచ్చుకోవాలి.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఛలో విజయవాడ

## - మార్చి 4న భారీ ర్యాలీ మంత్రులు సమక్షంలో సభ - పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నదే ప్రధాన లక్ష్యం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (నేషనల్ అలెయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అక్కయ్యపాలెం జంక్షన్ లోని ఒక ప్రయివేటు హోటల్ లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ల కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి యూనియన్ నేతలు చర్చించారు. అనంతరం గంట్ల శ్రీనుబాబు, నారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించిన సుమారు 11 డిమాండ్ల సాధన కోసం చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే ఇందులో అక్రిడేషన్ లు సమస్య కొంత కొలిక్కి వచ్చిందన్నారు. ఇక మిగిలిన డిమాండ్ లకు సంబంధించి మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇంటి కల నెరవేరలేదని ప్రభుత్వాలు మారుతున్నా కనీసం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించడం లేదన్నారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రమాధ భీమా పథకాన్ని పునరుద్దరించాలని, ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అమలు చేస్తున్న పెన్షన్ విధానం అమలు చేయాలని, మీడియా హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తామంతా కోరుతున్నామన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందజేస్తున్న తరుణంలో సమాజం కోసం పాటు పడుతున్న జర్నలిస్టులకు వారి కుటుంబాలకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. అలాగే సుమారు 11 డిమాండ్లతో ఇప్పటికే తాము దశల వారీగా ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో మరోసారి వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వంలో పెద్దల దృష్టికి తీసుకు వెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు.

మార్చి 4న చలో విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఆరోజు ఉదయం విజయవాడలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని క్రమేపీ అది సభగా మారుతుందన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జర్నలిస్టుల సభకు అతిథులుగా రాష్ట్ర సమాచార, పౌరసంబందాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి, కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్‌లను ఆహ్వానించడం జరిగిందన్నారు. మంత్రులు హాజర ౹కానున్న ఈ సభలో జర్నలిస్టుల సమస్యలు వివరించి వాటి పరిష్కారాన్ని కోరుతామన్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వీరు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లు డి.రవి కుమార్, ఎ.సాంబశివరావు, పితాని ప్రసాద్, ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, ఆనంద్, ఎన్.రామకృష్ణ కృష్ణ పాత్రో, కిషోర్, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మధన్, శేషు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి బొబ్బర ప్రసాద్ చక్రి, హరి, రెడ్డి, నాయుడు, నగేష్ బాబు, రాజశేఖర్, సత్యనారాయణతో పాటు పెడరేషన్ ప్రతినిధులు.

# పురాతన కట్టడంపై ఆక్రమణ ఆరోపణలు

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం గాజుల మండ్యం పంచాయతీ పరిధిలోని నీలిసానిపేట గ్రామంలో స్వర్ణముఖి నది తీరాన వెలసిన శ్రీ బసవేశ్వర స్వామి వారి పురాతన ఆలయం ఆక్రమణలకు గురైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం చోళ రాజుల కాలంలో పూజలు అందుకుందని స్థానికులు చెబుతున్నారు.

గ్రామస్తుల వివరాల ప్రకారం సర్వే నంబర్లు 1182/1, 1182/2లో ఉన్న ఆలయ మండపం, గుడికి సంబంధించిన కొనేరు, సర్వే నెం.1101 సోమయ్య కాల్వ, సర్వే నెం.1147 నల్లపాలెం చెరువు కాల్వ భూములను గ్రామకంఠం పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎస్టీ బాలబడి కోసం నిలుపుకున్న భూములపైనా కన్నేశారని వాపోయారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో వజ్ర వైడూర్యాల రాశులుగా పోసి వ్యాపారం జరిగిన ప్రదేశంగా ప్రసిద్ధి పొందిన ఈ క్షేత్రం నేడు శిథిలావస్థకు చేరిందని తెలిపారు. ఆలయ ప్రాంగ ణం చుట్టూ ఆక్రమణలు పెరిగి చరిత్ర చిహ్నాలు చెరిగిపోతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయ మండపాన్ని కబ్జా చేసి, లోపల నిధులున్నాయనే అపోహలతో కుట్ర జరుగుతోందని గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

పురాతన ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాదని, ప్రాంతీయ చరిత్రకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు. ఇటువంటి కట్టడాలు కబ్జాకు గురైతే భవిష్యత్ తరాలకు చరిత్రను చూపే ఆధారాలు కనుమరు గయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఆక్రమణలను తొలగించి ఆలయాన్ని రక్షిం చాలని నీలిసానిపేట గ్రామస్తులు కోరారు.

లేనిపక్షంలో కలెక్టర్ కార్యాల యం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నీలసాని పేట గ్రామ కంఠంలోని శ్రీ బసవేశ్వర స్వామి ఆలయం కోసం కేటాయించిన భూమిలో ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టినట్టు సమాచారం.

# సంపాదకీయం

## భారత్‌కు భాగవత్ దిశా నిర్దేశమేమిటి?

'మనం ప్రతి ఒక్కరినీ ఎలాంటి ప్రతిఘటన లేకుండా అంగీకరించాలి' (సర్వేషాం అవిరోధేనా) అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ ఒక సందర్భంలో చెప్పారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100వ సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా ఆయన దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ పలు సభల్లో ప్రసంగిస్తున్నారు. అనేక వర్గాల వారితో సమావేశమై సంభాషణలు జరుపుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ఒకప్పుడు ఆర్‌ఎస్ ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించినవారు, ఆ సంస్థపై ఏ అభిప్రాయం లేని తటస్థులతో పాటు రకరకాల వర్గాల్లో దూరి తమ ఉనికిని చాటుకునే మహానుభావులు సైతం మోహన్ భాగవత్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. విద్యావేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు, వణిక్ ప్రముఖులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, నటులు, మీడియా ప్రతినిధులు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు ముంబైలో అక్షయ్‌కుమార్, రణబీర్‌కపూర్, సల్మాన్ ఖాన్ తదితర తారాగణం భాగవత్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. మంచి సందేశాలు వ్యాప్తి చేసే సినిమాల్లో నటించినందుకు సల్మాన్ ఖాన్‌ను భాగవత్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో వామపక్షీయులు కూడా భాగవత్ ప్రసంగానికి హాజరుకావడం గమనార్హం. ఇంత విస్తృత స్థాయిలో వివిధ వర్గాల వారిని ఒక సంస్థ ఆకర్షించడం సాధారణ విషయం కాదు. దేశం ఇప్పుడు ఒక సైద్ధాంతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సిద్ధాంతాల ప్రాతిపదికన జరిగిన అనేక ఉద్యమాలు పరీక్షలకు, సమీక్షలకు, వైఫల్యాలకు లోనై కొట్టుకుపోయాయి. సైద్ధాంతిక దారిద్ర్యం అంతటా తాండవిస్తోంది. సమాజం పట్ల, అణగారిన వర్గాల పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించేవారు ఒక మూసలో ఇమడలేకపోతున్నారు. ఇప్పుడే కాదు, గతంలో కూడా తత్వవేత్తలు ఇలాంటి సామాజిక పరిస్థితులను ఎదుర్కొని విశ్లేషించిన సందర్భాలున్నాయి. మరి మోహన్ భాగవత్ ప్రస్తుత అయోమయ పరిస్థితులలో ఏమి మాట్లాడతారా అన్న ఆసక్తితోనే అనేకమంది ఆయన సభలకు హాజరు అవుతున్నారని అర్థం చేసుకోవల్సివున్నది. రకరకాల భావజాలాల అనుయాయులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్‌ఎస్ ఎస్ విస్తరిస్తుండడం, దాని అనుబంధ రాజకీయ సంస్థ అయిన భారతీయ జనతా పార్టీ తిరుగులేని జాతీయ రాజకీయ శక్తిగా ప్రభావ ప్రాబల్యాలను సంతరించుకోవడం ఒక రకంగా సంఘ్ పరివార్ శక్తులకు సదవకాశం. అయితే 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఒక నిర్దుష్టమైన స్పష్టతతో ఉన్నదా? ఈ విషయాన్ని తరచి చూడవలసిన అవసరం ఉన్నది. హెగ్డేవార్ స్థాపించిన ఆర్‌ఎస్ ఎస్ కూడా ఇప్పటి ఆర్‌ఎస్ ఎస్‌కూ ఎంతో తేడా ఉన్నది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి, గత పది సంవత్సరాలకు పైగా నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా కొనసాగడానికి కారణమైన ఆర్‌ఎస్‌ఎస్ ఇవాళ ఒక సంధి దశలో ఉన్నది. కేంద్రంలో మోదీ ఇవాళ ఏమి చేసినా జనం ఆర్‌ఎస్ ఎస్ వైపు చూస్తున్నారు. మోదీ చేసిన మంచి పనులకు ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎంత ఘనత లభిస్తుందో, ఆయన తీసుకున్న అన్ని నిర్ణయాలకూ ఆర్‌ఎస్‌ఎస్ జవాబుదారీ అవుతుందని చాలా మంది భ్రమిస్తున్నారు. అయోధ్యలో బాల శ్రీరాముడి ప్రతిష్ఠాపన సమయంలో నరేంద్రమోదీ వెనుక మోహన్ భాగవత్ ఉన్న దృశ్యాలను చూసినవారు మోదీకి అన్ని విషయాల్లోనూ మోహన్ భాగవత్ అండగా ఉంటారనుకోవడంలో ఆశ్చర్యం లేదు. విచిత్రమేమంటే జాతీయవాదులు అని తమను తాము చెప్పుకుంటున్నవారు కూడా మోదీ చేసిన అన్ని పనులను పిడివాదంతో సమర్థించడం, ప్రత్యర్థులపై తీవ్ర పరిభాషలో విరుచుకుపడడం ప్రస్తుత సైద్ధాంతిక అయోమయాన్ని మరింతగా తీవ్రతరం చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్‌కూ బీజేపీకి మధ్య ఉన్న తేడాను స్పష్టంగా చెప్పేందుకు మోహన్ భాగవత్ అనేక సమావేశాల్లో ప్రయత్నించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి రాజకీయ అధికార ఆకాంక్ష లేదని, మొత్తం హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, పౌరుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం తమ ఏకైక లక్ష్యమని ఆయన ఇటీవల డెహ్రాడూన్‌లో మాజీ సైనికాధికారుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను బీజేపీతో పోల్చి చూడకూడదని, బీజేపీ కళ్లతో ఆర్‌ఎస్‌ఎస్‌ను చూడడం అతి పెద్ద తప్పిదమని ఆయన గత ఏడాది కోల్‌కతాలో చెప్పారు. కాని చాలా మంది తటస్థ వాదులకు ఆర్‌ఎస్ ఎస్ అంటే బీజేపీయే. దాదాపు 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో లేకపోతే, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇవాళ ఇంత ప్రాధాన్యం లభించేది కాదని వారు వాదిస్తున్నారు. అధికారం అనేది ఒక అయస్కాంతం లాంటిది. ఆ అయస్కాంతానికి ఆకర్షితులైనవారందరూ నేడు ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా ఆకర్షితులవుతున్నారు. మోహన్ భాగవత్ సమావేశాలకు వచ్చిన వారందరూ ఆర్‌ఎస్ ఎస్ భావజాలం నచ్చి వచ్చి ఉంటారని అనుకోవడానికి వీల్లేదు. భాగవత్, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దల దృష్టిలో పడడం వల్ల, ఆ సమావేశాలకు హాజరయ్యామని చెప్పుకోవచ్చు; ఆ పెద్దలతో ఫోటోలు దిగి ప్రచారం చేసుకోవచ్చు; తద్వారా తమకేదో మేలు జరుగుతుందనే అభిప్రాయం అటువంటి వారిలో నెలకొని ఉన్నదని స్పష్టమవుతోంది. 'బీజేపీ అధికారంలో లేకపోతే ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎవరు పట్టించుకుంటారు?' అని ఆ సమావేశానికి వెళ్లి వచ్చిన ఒక మేధావి వ్యాఖ్యానించారు. బహుశా తమలో బలంగా లేని ఒక భావజాలం తమకు నచ్చిందని పైకి ప్రకటించడం వల్ల కొందరు ప్రయోజనాలు, పదవులు, పురస్కారాలు పొంది ఉండవచ్చు. ఈ స్వార్థపరత్వం మరికొందర్ని ఆకర్షిస్తోంది. బీజేపీలో మంత్రులుగా ఉన్నవారందరికీ సంఘ్ భావజాలం గురించి అంత బలమైన అవగాహన ఉన్నదని చెప్పేందుకు ఆస్కారం లేదు. ఈ బూటకత్వాన్ని సంఘ్ పరివార్‌లో కొందరు గమనించే ఉంటారు. 'ముందు వచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన కొమ్ములే వాడి' అని వాపోయేవారు లేకపోలేదు.

# జనసేన ఉద్యమి కార్యక్రమంలో ప్రతి ఒక్క జనసేన కార్యకర్త ఉద్యమి సభ్యత్వం తీసుకోవాలి

### - 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయానికి అనుగుణంగా, విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు మరియు జనసేన నగర అధ్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుండి మార్చి 10 వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వం నిరంతరాయంగా కొనసాగుతుందని పార్టీకి కష్టపడే జనసేన కార్యకర్త భద్రత దృష్ట్యా జనసేన పార్టీ కార్యకర్తలు "మెంబర్షిప్ టు లీడర్‌షిప్" అనే అంశంతో కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 3 విభాగాలుగా ఉద్యమి- సాధక్ - ప్రదాతలుగా వర్గీకరించారు. ఉద్యమి సభ్యత్వం 400 రూపాయలతో కార్యకర్త క్రియాశీలక సభ్యత్వం తీసుకోగా వారికి యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ 50,000 రూపాయలు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు 5,00,000 రూపాయలు ఇస్తున్నట్టు జనసేన పార్టీ అధినేత ప్రకటించారని, అంతేకాకుండా 2 కోట్ల రూపాయలు పార్టీకి విరాళంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి అందజేసి మెంబర్షిప్ తీసుకుని ప్రదాత అయ్యారని, ఎవరైతే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తారో వారికి సాదక్‌గా పార్టీ గుర్తిస్తుందని 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్ తెలిపారు. 29వ వార్డులో ప్రతి జనసేన కార్యకర్త, వీరమహిళ జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం తీసుకుని జనసేన పార్టీ సభ్యుడిగా చేరాలని తెలియజేశారు. 29వ వార్డులో జనసేన క్రియాశీలక సభ్యుడిగా ఉన్న ప్రతి ఒక్కరికి తాను అండగా ఉంటానని తెలియజేశారు.

# విశాఖ నగర సుందరీకరణకు రాత్రి పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణే కీలక పాత్ర

### - రాత్రి పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగర సుందరికరణకు రాత్రి పారిశుధ్యం,వీధి దీపాల నిర్వహణే కీలక పాత్ర అని, నగరంలోని రాత్రి వేళల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం అర్ధ రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సోమవారం ఆయన తెలుగు తల్లి ఫ్లైఓవర్ పరిసరాలు, జగదాంబ జంక్షన్ నుండి పూర్ణ మార్కెట్ వరకు విస్తరించిన ప్రాంతం, బీచ్ రోడ్డు, ఎంవిపి కాలనీ,అప్పు ఘర్ సమీప ప్రాంతాలలో ఫీల్డ్ స్థాయిలో రాత్రిపూట జరుగుచున్న పనులను తనిఖీ చేస్తూ సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ, విశాఖ నగర సుందరీకరణకు ముఖ్యంగా నిత్యం రాత్రి పూట నిర్వహిస్తున్న రోడ్లు, ఫుట్ పాత్‌లు, బహిరంగ ప్రదేశాలు, కాలువల పరిశుభ్రత, పారిశుధ్య పనులు, వీధి దీపాలు నిర్వహణ ఎంతో కీలకమన్నారు. పారిశుధ్య కార్మికులు విధులను నిబద్ధతతో, నిజాయితీతో నిర్వహించాలని ప్రోత్సహించారు. రాత్రి వేళల్లో నగర పరిశుభ్రతను కాపాడడంలో వారి పాత్రను ప్రశంసిస్తూ, రాత్రి పారిశుధ్య సిబ్బంది కృషిని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు విధి నిర్వహణకు అవసరమగు పరికరాలు లోటు లేకుండా



సమకూర్చాలని, వాణిజ్య సముదాయాల వ్యర్థాల సేకరణను మరింత బలోపేతం చేసి, వ్యాపారులు వ్యర్థాలను బయట పడవేయకుండా నిత్యం జేబీఎంసీ వాహనాలకు అందించేలా అవగాహన పరుస్తూ పర్యవేక్షించేయాలని, వీధి దీపాల నిర్వహణ, సమర్ధవంతమైన పనితీరును పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. విశాఖ నగరంలో పారిశుధ్యం, వీధి దీపాలు నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ జరుపుతూ విశాఖ నగరాన్ని మరింత సుందరీకరణతో అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు జివీఎంసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధి నిర్వహణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# ఆదాయం వంతంగా అడివి వ్యవసాయం

### - ఎన్విరాన్మెంటల్ సైన్స్ చదివి అనేక వ్యవసాయ పద్ధతులు - పురాతన పద్ధతిలో ప్రకృతి ఆధారంగా అనేక పంటలు - ఆకుకూరల నుండి దేశీయ పండ్ల మొక్కలు పెంచుతున్న జగదీష్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆదాయంవంతంగా అడివి వ్యవసాయం చేస్తున్న అద్భుతమైన దృశ్యం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరబ్బ పంచాయతీ పల్లెపుకొరాబు గ్రామంలో కనిపిస్తుంది. సనపల జగదీష్ పెరిగింది విశాఖపట్నం మహానగరంలో, చదివింది ఎమ్మెస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్, కానీ పురాతన పద్ధతిలో ప్రకృతి ఆధారంగా అనేక పంటలు పండించడం విశేషం.

అతని సతీమణి డాక్టర్ ఇందుకూరి విష్ణు ప్రియకూ వ్యవసాయం అంటే మక్కువ కావడంతో ఇద్దరూ ఇష్టంగా వ్యవసాయం చేస్తున్నారు. ఈమె సైతం ఎన్విరాన్మెంటల్ సైన్స్‌లో డాక్టరేట్ చేయడం విశేషం. వీరిరువురు ఆకుకూరల నుండి అనేక వృక్షాలు పెంచుతున్న ఈ పొలాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలి. వ్యవసాయం దండగ, పెట్టుబడి పెట్టడమే ఆదాయం ఉండదని చెప్పేవారు అధికం. ఇటువంటి పరిస్థితుల్లో గడిచిన అయిదు సంవత్సరాలుగా ప్రకృతి ఆధారంగా వీరు పంటలు పండించడం విశేషం. పట్టభద్రులు సాగిస్తున్న వ్యవసాయాన్ని వీక్షించడానికి విశాఖపట్నం నుంచి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, మ్యాంగో మేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ఇంజినీర్ అల్లు గోపి, గోశాల ప్రతినిధి అచ్యుత రావు, సనపల ప్రసాద్ తదితరుల బృందం జగదీష్‌కు చెందిన సమతుల్య ఫామ్‌ను సందర్శించింది. వీరంతా అక్కడ పిలకలు తొలగించకుండా అరటి సాగు చేయడం చూసి ఆశ్చర్య పోయారు. ఒకే చెట్టు గుంపులుగా పెంచడం, ఆ గుంపులో రెండు మూడు గెలలు బలంగా పెరగడం గమనిం చారు. బోదెలు వేసి ఆకుకూరలు, కాయగూరలు పెంచడం, అడవి వ్యవసాయ పద్ధతిలో పండ్లు తోటలు పెంచడం, ప్రకృతి ఆధారంగా మల్చింగ్ పద్ధతులు ద్వారా పంటలు పండించడం, రసాయనాలు వినియోగించకుండా అధిక దిగుబడి సాధించడం చాలా గొప్ప విశేషం. 150కి పైగా పంటలు పండిస్తున్న ఈ యువత దేశంలో యువతకు ఆదర్శం అని ఈ పొలాన్ని సందర్శించిన బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది.

# పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు అవగాహన

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండల పరిధిలోని ఏటూరు, వావిలేరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పి.ఎస్. హిమబిందు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ ప్రయోజనాలను రైతులకు వివరించారు. రెండు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంట పొలాలను పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందించారు. మట్టి నమూనాలు సేకరణ విధానం, వాటి ఉపయోగాలు మరియు సాయిల్ హెల్త్ కార్డ్ అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



వ్యవసాయ శాఖ సిబ్బంది ఇమ్రాన్, సూర్యనారాయణతో పాటు రైతులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

### - జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి




**కావలి, (రాజధాని వార్తలు):** కావలి పట్టణంలో 'మేరా యువ భారత్ (మై భారత్)' మరియు 'ది పూర్ పీపుల్ వాలంటీర్ ఆర్గనైజేషన్' సంయుక్త ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. యువతలో సామాజిక స్పృహ పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువత కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. 'మేరా యువ భారత్' వేదిక ద్వారా యువత తమ ప్రతిభను, నైపుణ్యాలను పెంపొందించుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాగేశ్వరరావు (సెట్నెల్ సీఈఓ) మాట్లాడుతూ యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. శ్రీనివాసులు యువజన సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. చిన్న (ఎన్జీఓ ప్రతినిధి, ది పూర్ పీపుల్ వాలంటీర్ ఆర్గనైజేషన్) మాట్లాడుతూ సేవా దృక్పథంతో పనిచేసే యువతకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 'మేరా యువ భారత్' ప్రతినిధులు, వివిధ యువజన సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవకులు మరియు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్విమ్స్ పద్మావతి ఆసుపత్రి వద్ద కరపత్రాల ఆవిష్కరణ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** స్విమ్స్ పద్మావతి ఆసుపత్రి వద్ద ఫిబ్రవరి 27 నుంచి ప్రారంభమయ్యే రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.వేణుగోపాల్, సిఐటియు నగర అధ్యక్షురాలు బుజ్జి మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో గత మూడేళ్లుగా కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేయడం అన్యాయమని విమర్శించారు. గత సంవత్సరం జరిగిన సమ్మె సందర్భంగా అధికారుల సమక్షంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. మూడు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పిన సమస్యలు దాదాపు పది నెలలు గడిచినా అమలు కాకపోవడం కార్మికులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ హోదాను రద్దు చేసి వార్డు బాయ్‌లుగా పరిగణించాలి, కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలి, సమ్మె సందర్భంగా ఏర్పాటు చేసిన యాస్కీ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని, కార్మికులపై జరుగుతున్న వివక్షను నిలిపి వేయాలని స్పష్టం చేశారు. దళితులు, బడుగు బలహీన వర్గాలు, మహిళా కార్మికులు అధికంగా పనిచేస్తున్న వారి పట్ల నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. 27న స్విమ్స్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ దీక్షలకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, మేధావులు, ప్రజలు విస్తృతంగా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ యూనియన్ కార్యదర్శి రవి, అధ్యక్షుడు విసూరి, కోశాధికారి మారిముత్తు, గోపి, కుమారి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# క్వార్ట్జ్ టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణం సాధుపేట సెంటర్ నుండి నారాయణ కాలేజీ మీదుగా మినీ బైపాస్‌కు పోవు దారిలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని అధిక వేగంతో క్వార్ట్జ్ లోడ్‌తో వెళ్ళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టగా ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని టిప్పర్‌ను పోలీసులు గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడు గూడూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మందా శ్రీనివాసులుగా ఆయనకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గూడూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# ప్రేమకథలతో యంగ్ హీరోకి పరీక్ష పెడుతున్న డైరెక్టర్లు



సీనియర్ యాక్టర్ శ్రీకాంత్ కొడుకు రోషన్ మేక ప్రస్తుతం తన కెరీర్లో కీలక దశను ఎదుర్కొంటున్నాడు. పెళ్లి సందణ సినిమా ద్వారా హీరోగా పరిచయమైన రోషన్‌కు ఆ సినిమా అనుకున్న రిజల్ట్ ను ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో వచ్చిన ఛాంపియన్ తో రోషన్ ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. కథ పరంగా ఛాంపియన్ కొత్తగా ఉన్నప్పటికీ, ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద సరైన బ్రేక్ ను అందుకోలేకపోయింది. దీంతో తర్వాతి ప్రాజెక్టుల ఎంపిక విషయంలో రోషన్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే రోషన్ ప్రస్తుతం శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న ఏమో ఏమో ఇది అనే లవ్ స్టోరీని చేస్తున్నాడు. వాస్తవానికి శైలేష్ ఇప్పటివరకు లవ్ స్టోరీని చేసింది లేదు. హిట్‌లాంటి సస్పెన్స్, థ్రిల్లర్ స్టోరీలతో బాగా పాపులర్ అయిన శైలేష్, ఈ సినిమాతోనే మొదటిసారిగా ప్రేమ కథను తెరకెక్కిస్తున్నారు. తన గత సినిమాల శైలికి భిన్నంగా, ఎమోషన్స్‌కు ప్రాధాన్యతనిచ్చే కథతో ఆడియన్స్‌ను ఆకట్టుకోవాలని శైలేష్ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ శైలేష్‌తో ఓ లవ్ స్టోరీని చేస్తున్న రోషన్, ఇప్పుడు మరో ప్రేమ కథా చిత్రానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇంద్రగంటి మోహన్ కృష్ణ ఈ లవ్ స్టోరీకి దర్శకత్వం వహించనున్నారనే వార్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంద్రగంటి నుంచి గతంలో సమ్మోహనంలాంటి అద్భుతమైన ప్రేమ కథను తెరకెక్కించినప్పటికీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంతో కష్టమ్మీద హిట్‌గా నిలిచింది.

సమ్మోహనం సినిమాను డైరెక్ట్ చేసినప్పటికీ ఇంద్రగంటి కామెడీ మరియు ఫ్యామిలీ ఎంటర్టైనర్లే ఎక్కువ చేశారు. ఈ ఇద్దరూ డైరెక్టర్లూ తమకు మంచి పట్టున్న జానర్ ను వదిలి లవ్ స్టోరీల వైపు మళ్లడమే కాకుండా, ఇద్దరూ ఒకే హీరోతో సినిమాలు చేస్తుండటం విశేషం. సాధారణంగా ఒక హీరో లేదా డైరెక్టర్ ఎప్పుడూ ఒకే జానర్‌కు పరిమితమవడం గతంలో ఎక్కువగా కనిపించేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారడంతో కథ స్ట్రాంగ్‌గా ఉంటే ఆడియన్స్ జానర్ ను పట్టించుకోకుండా సినిమాలను ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోషన్ తీసుకున్న డెసిషన్ అతని కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లే టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. టాలీవుడ్‌లో కొత్త తరహా కంటెంట్‌కు మంచి ఆదరణ లభిస్తున్న టైమ్‌లో, యంగ్ హీరోగా రోషన్ తన ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నాడు. లవ్ స్టోరీలతో మంచి ఇమేజ్‌ను సృష్టించుకోవాలనే ఆలోచన రోషన్‌లో కనిపిస్తోంది. అయితే ఈ ప్రాజెక్టులు కేవలం డైరెక్టర్లకే కాకుండా రోషన్‌కు కూడా కీలక పరీక్షగా మారనున్నాయి. మరి ఈ సినిమాలు రోషన్‌కు ఎలాంటి ఫలితాన్ని అందిస్తారో చూడాలి.

# ముందుచూపు తప్పనిసరి అంటోన్న మిల్కీ బ్యూటీ



గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఎప్పటికీ నిలవవని, స్టార్‌డమ్ శాశ్వతం కాదని టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అవకాశాలు వరుస పెడుతున్నప్పుడే ఫ్యూచర్ గురించి ఆలోచించాలి, లేకపోతే కెరీర్ చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఆమె స్పష్టం చేయడం సినీ ఇండస్ట్రీ రియాలిటీకి ఒక రియల్ చెక్‌లా మారింది. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూసుకోవాలి 15 ఏళ్ల వయసులోనే వెండితెరకు పరిచయమైన తమన్నా గత రెండు దశాబ్దాలుగా అగ్ర హీరోల సరసన నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అయితే ఈ ప్రయాణం కేవలం గ్లామర్, హిట్ సినిమాల వరకే పరిమితం కాలేదని ఆమె చెబుతున్నారు. చేతి నిండా సినిమాలు ఉన్నప్పుడే సంపాదనను సరైన దిశలో మళ్లించాలని, నటీనటుల కెరీర్ ఎప్పుడెప్పుడు మలుపు తిరుగుతుందో చెప్పలేమని, కాబట్టి ముందుగానే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఏర్పరుచుకోవాలంటూ ఆమె చెప్పిన మాటలు ఇండస్ట్రీలోని అస్థిరతను స్పష్టంగా చూపిస్తున్నాయి. సినిమా రంగం వెలుగుల ప్రపంచమే అయినా, అవకాశాలు తగ్గిన తర్వాత చాలామంది కళాకారులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు కొత్తవి కావు. ఒకప్పుడు టాప్‌లో ఉన్నవారు కూడా తరువాతి కాలంలో ఇబ్బందులు పడిన సంఘటనలు చాలానే చూశాం. ఈ నేపథ్యంలో తమన్నా చేసిన వ్యాఖ్యలు యువ నటీనటులకు హెచ్చరికలా మారాయి. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడే ఫ్యూచర్ కోసం బలమైన ఆర్థిక ప్రణాళిక అవసరమని ఆమె సూచిస్తున్నారు. అయితే తనకు ఈ దూరదృష్టి రావడం వెనుక తన తండ్రి పాత్ర ఎంతో కీలకమని తమన్నా స్పష్టం చేశారు. ఇండస్ట్రీలోకి వచ్చిన తొలి రోజుల నుంచే తన ఆర్థిక వ్యవహారాలన్నీ తన తండ్రే చూసుకున్నారని.. ఖర్చు, పొదుపు, పెట్టుబడుల విషయంలో ఆయన చూపిన క్రమశిక్షణే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని తమన్నా పేర్కొన్నారు. తన తండ్రి నేర్పిన పాఠాలే తనను రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చేశాయని, కుటుంబం నుంచి వచ్చిన మార్గనిర్దేశమే తనకు భరోసానిచ్చిందని తమన్నా వెల్లడించారు.

ప్రస్తుతం యాక్టింగ్‌తో పాటు సొం తంగా జ్యుయలరీ బిజినెస్‌ను రన్ చేస్తున్న తమన్నా, కెరీర్ ఎంత బిజీగా ఉన్నా ఆర్థిక ప్రణాళిక విషయంలో రాజీ పడనని చెబుతున్నారు. ఇండస్ట్రీలో మంచి ఫామ్ ఉన్నప్పుడే ఫ్యూచర్ కోసం పునాది వేసుకోవాలని తమన్నా ఇచ్చిన మెసేజ్ కేవలం నటీనటులకే కాదు, అన్ని రంగాల వారికి కూడా వర్తించేదే. స్టార్‌డమ్ కంటే స్థిరమైన భవిష్యత్తే ముఖ్యమని ఆమె వ్యాఖ్యలు మరోసారి గుర్తు చేశాయి.

# నాని 'ప్యారడైజ్'.. ఇండస్ట్రీ షాక్ అయినట్లు ఉందే?



నేచురల్ స్టార్ నాని తన గెటప్, డ్యాన్స్, ఎక్స్ప్రెషన్స్‌తో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు. ఏకంగా ఇండస్ట్రీని ఆశ్చర్యపరిచారు! దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కలిసి ఆయన చేస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్ నుంచి విడుదలైన మొదటి పాట ఆయా షేర్.. సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పాట విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. గతంలో ఇదే కాంబినేషన్‌లో వచ్చిన దసరా బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమాలో నానిని మాస్ రోల్‌లో చూపించి దర్శకుడు మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ది ప్యారడైజ్ మూవీలోనూ నానిని పూర్తిగా భిన్నమైన లుక్‌లో చూపించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సాంగ్‌తో క్లారిటీ వచ్చేసింది. ఆయా షేర్ పాటలో నాని రగ్డ్ స్టైల్, ఎనర్జిటిక్ డాన్స్, మాస్ బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా హార్డ్ ఫ్లోర్ స్టెప్స్ వేస్తూ ఆయన చూపించిన జోష్.. అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు చూడని కొత్త అవతార్‌లో నాని కనిపించడం.. ఆ పాటకు స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్యారడైజ్ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఫ్రేమ్‌లో గ్రాండ్ విజువల్స్, భారీ సెట్స్, నేచురల్ టోన్ కనిపిస్తున్నాయి. మాస్ లీడర్ స్టోరీని రియాలిటీగా, స్టైలిష్‌గా చూపించాలన్న ప్రయత్నం స్పష్టంగా తెలుస్తోంది. ఆయా షేర్ పాటకు సంగీతం అందించిన అనిరుధ్ రవిచందర్ మరోసారి తన మాస్ బీట్‌తో ఆకట్టుకున్నారు. ఫోక్ టచ్‌తో కంపోజ్ చేసిన ఆ ట్యూన్‌కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్ వీడియోల రూపంలో పాట ఫుల్ వైరల్ అవుతోంది. ఇక సినిమాను నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నిర్మాణ విలువల్లో ఎలాంటి రాజీ లేకుండా ఇంటర్నేషనల్ వాల్యూస్‌తో రూపొందిస్తున్నట్లు సమాచారం. మొదటి పాటకు వచ్చిన రెస్పాన్స్ చూసి.. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అని చాలామంది ఫిక్స్ అయ్యారు. ఏదేమైనా ది ప్యారడైజ్ చిత్రం ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ వరల్డ్ రేంజ్‌లో విడుదల అవుతుంది. అయితే ఒక్క పాటతోనే ఇంతటి హైప్ తెచ్చుకున్న ఆ సినిమా విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. మొత్తానికి.. నాని మరోసారి తన కెరీర్ లో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతూ అభిమానుల్లో ఆసక్తి రేపుతున్నారు. ది ప్యారడైజ్ ఆయన కెరీర్‌లో మరో మైల్ స్టోన్‌గా నిలిచేలా కనిపిస్తోంది. మరి మూవీ ఎలా ఉంటుందో, ఎంతటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# లేలేత మెరుపులతో మంత్రముగ్ధుల్ని చేస్తున్న రుక్మిణీ!



కొత్త నీరు వస్తే పాత నీరు పోతుంది అనేది ఎంత వాస్తవమో.. కొత్త హీరోయిన్లు వచ్చేసరికి పాత వాళ్ళ క్రేజ్ తగ్గుతుందనే కామెంట్లు కూడా అంతే వినిపిస్తూ ఉన్నాయి. అయితే ఈ కొత్త హీరోయిన్లు కూడా తమ లేలేత మెరుపులతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాలలోకి అడుగుపెట్టి తమ అందంతో ప్రేక్షకులలో ఒక ఉనికిని సంపాదించుకుంటూనే.. ఇంకొక వైపు నటనతో విశ్వరూపం చూపించే ప్రయత్నం చేస్తున్నారు. అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ.. ఫాలోవర్స్‌ను పెంచుకుంటూ బ్రాండ్ ప్రమోటర్స్‌గా కూడా మారుతున్నారు. ఇదిలా ఉండగా 2024లో నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది రుక్మిణి వసంత్. అంతకుముందు కన్నడలో నటించిన ఈమెకు మంచి గుర్తింపు లభించింది కానీ ఈ తొలి తెలుగు చిత్రంతో పెద్దగా గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ఆ తర్వాత ఏ. ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా మదరాసి సినిమాతో తమిళ్ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఎప్పుడైతే రిషబ్ శెట్టి తన కాంతారా చాప్టర్ 2 సినిమాలో అవకాశం కల్పించారో అప్పటినుంచి ఈమె వార్తల్లో నిలుస్తూ వచ్చింది. ఇక సినిమాలో తన అద్భుతమైన నటనతో విశ్వరూపం చూపించింది. ఈ ఒక్క సినిమాతో ఏకంగా పాన్ ఇండియా స్థాయి గుర్తింపును సొంతం చేసుకుందని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికంటే ముందే ఈమె ఎన్టీఆర్ – ప్రశాంత్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాకి కూడా సైన్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా విక్రమ్ కొడుకు ధృవ్ విక్రమ్ హీరోగా వస్తున్న సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె.. మరొకవైపు నాగచైతన్య కొత్త సినిమాలో కూడా అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో హీరో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా రుక్మిణి వసంత్ కీలకపాత్ర పోషిస్తుంది.

ఇలా భారీ ప్రాజెక్టులలో అవకాశాలు అందు కుంటూ బిజీగా మారిన రుక్మిణి మరొకవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కు దగ్గర అయ్యే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే తాజాగా సింపుల్ లుక్‌లో లేత అందాలను చూపిస్తూ అభిమానులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ అవుట్ఫిట్‌తో అందాలు మొత్తాన్ని దాచేస్తూ లేత మోముతో అభిమానులను ఆకట్టుకుంది. ఇక రుక్మిణి వసంత్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా..అమ్మడి అందానికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా రుక్మిణి వసంత్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి.

# మార్ట్ ప్రాజెక్టుతో జిల్లా గ్రామీణ ఆర్థిక ముఖచిత్రం మారాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆకాంక్ష




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మార్ట్ (మన్యం అగ్రి రూరల్ ట్రాన్స్ఫర్మేషన్) ప్రాజెక్టు అమలుతో జిల్లాలో గ్రామీణ ఆర్థిక ముఖచిత్రం మారాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆకాంక్షించారు. మన్యం జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో మార్ట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలను మంగళవారం సాయంత్రం నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మార్ట్ అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రైతులు, పాడి రైతులు, గ్రామీణ వృత్తిదారుల ఆదాయాన్ని మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పంటల ఉత్పాదకతను పెంచడం, వ్యవసాయ, పాడి రైతులకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించి లాభదాయకంగా చేయడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రత్యక్ష మార్కెట్ అనుసంధానం చేయడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. వీటిని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడిఏ ఏపీఓ మురళీధర్, డీఆర్డిఏ పీడీ ఎం.సుధా రాణి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్.మన్మధరావు,జిల్లా వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెంబర్‌షిప్ టూ లీడర్ షిప్ - ఉద్యమి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : జనసేన నాయకులు అవనాపు విక్రమ్

**- ఉద్యమం సాగించే వారే ఉద్యమి - వారే జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లే వారధులు**
**- జనసేన నాయకులు అవనాపు విక్రమ్ - జెన్ - జీ తరాన్ని పార్టీ కి దగ్గర చేయాలి - జనసేన నాయకులు అవనాపు విక్రమ్ - పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులైన ప్రతీ ఒక్కరికీ ఉద్యమి సభ్యత్వాన్ని అందించాలి - జనసేన నాయకురాలు డా.అవనాపు భావన**




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల 26వ తేదీ నుండి జనసేన పార్టీ చేపట్టనున్న మెంబర్ షిప్ టూ లీడర్ షిప్ ఉద్యమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ భావన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం విజయనగరం బాలాజి నగర్ లోని అవనాపు విక్రమ్ కార్యాలయంలో జనసేన శ్రేణులతో సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంసిద్ధం చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు అవనాపు విక్రమ్ దిశా నిర్ధేశం చేశారు. సభ్యత్వ నమోదు ఏ విధంగా చేయాలి, ఎలా ముందుకు సాగాలి, పార్టీ మార్గదర్శకాలు ఎలా ఉన్నాయి తదితర అంశాలను వివరించారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్య మంత్రి వర్యులు కొణెదల పవన్ కళ్యాణ్ పార్టీని బలోపేతం చేసేందుకు త్రిశూల వ్యూహాన్ని రచించారని, అందులో భాగంగా ప్రతీ సభ్యున్ని నాయకునిగా తీర్చిదిద్ది పార్టీకి పటిష్టమైన నాయకత్వాన్ని అందించాలని సంకల్పించారని అన్నారు. ఉద్యమి, సాధక్, ప్రధాతల ద్వారా పార్టీకి అదనపు బలాన్ని సమకూర్చేందుకు పవన్ కళ్యాణ్అడుగులు ముందుకు వేసుస్తున్నారని అన్నారు. ఉద్యమం సాగించే వారే ఉద్యమి, అటువంటి ఉద్యమిలనుండే నాయకుల ఆవిర్భావం జరుగుతుందని అవనాపు విక్రమ్ అభిప్రాయపడ్డారు. జెన్ – జీ తరం అందరూ జనసేనలో ఉద్యమిలుగా ఉద్యమించే విధంగా, వారికి సభ్యత్వాలను కల్పించాలని విక్రమ్ అన్నారు. అధికారంలో ఉండి కూడా తన సొమ్ము కోట్లాది రూపాయలను ప్రజా సంక్షేమం కోసం వినియోగించే గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ని, అటువంటి నాయకుని నాయకత్వంలో పని చేయడం ఓ వరమని అవనాపు విక్రమ్ గారు అన్నారు. కార్యకర్తకు ప్రమాదాల వల్ల కష్టం కలిగినా, వారి కుటుంబాలకు నష్టం వాటిల్లినా ఆదుకునేందుకు రూపొందించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం వలన సంఘంలో గౌరవం, కుటుంబంలో భద్రత లభిస్తాయని అన్నారు. జనసేన పార్టీ పై అభిమానం, పవన్ కళ్యాణ్ పట్ల ప్రేమ, పార్టీ సిద్ధాంతాల మీద గౌరవం ఉన్న వారిని ఉద్యమిలుగా నమోదు చేయాలని అన్నారు. విజయనగరం నుండి గౌరవ ప్రదమైన సభ్యత్వాల సంఖ్యను నమోదు చేసే విధంగా సమిష్టి కృషి చేయాలని అవనాపు విక్రమ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు.
కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ అవనాపు భావన మాట్లాడుతూ మెంబర్ షిప్ డ్రైవ్ జరిగే రెండు వారాలు కీలకమైనవని అన్నారు. జనసైనికులు, వీర మహిళలు, సాధక్‌లు కలసికట్టుగా ముందుకు సాగి, విజయనగరం నుండి అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలని పిలుపునిచ్చారు. మెంబర్ షిప్ డ్రైవ్ సమయంలో ఎదురైన చాలెంజ్‌లను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ కార్యాచరణతో సిద్దం కావాలని హితవు పలికారు. జనసేన పార్టీ సిద్దాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులైన ప్రతీ ఒక్కరికీ ఉద్యమిగా సభ్యత్వాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల తరఫున పోరాటం

### - న్యాయం జరిగే వరకూ పోరాడుతాం : సి.పి.ఐ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాల నాగేశ్వరరావు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకూ పోరాటాలు ఆపేదే లేదని సి.పి.ఐ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని దావాలపేట గ్రామంలో గల అగ్రిగోల్డ్ లే-అవుట్‌ను రాష్ట్ర సిపిఐ బృందం సందర్శించింది. లే అవుట్ను పరిశీలించిన అనంతరం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా అగ్రిగోల్డ్ బాధితుల తరఫున పోరాటం చేస్తున్నామని, ఆ పోరాటం ఫలితంగానే సుమారుగా 10 లక్షల మంది బాధితులకు న్యాయం జరిగిందన్నారు. ఇంకా 20 లక్షల మంది బాధితులకు న్యాయం జరగాల్సి ఉందని ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఇ.వి రాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, ఆర్.ఎస్.కుమార్, నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

### - వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు





**దత్తిరాజేరు (గజపతినగరం), (రాజధాని వార్తలు):** దత్తిరాజేరు మండల పరిధిలో గల స్థానిక టీ.బూర్జవలస గ్రామంలో శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవాలలో ప్రముఖ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి గజపతినగరం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే, వైకాపా సీనియర్ నాయకులు బొత్స అప్పలనరసయ్య, టిడిపి మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ నిర్వహకులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొత్స, కే ఏ నాయుడు మాట్లాడుతూ ఉమా రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలలో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక



రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, గజపతినగరం జడ్పిటిసి గార తవుడు, దత్తి రాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పల నాయుడు, మంత్రి అప్పలనాయుడు, రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తి రెడ్డి రమేష్, యువజన విభాగం అధ్యక్షులు చిరంజీవి, సర్పంచ్ క్రాంతి కుమార్, మహదేవ్ ఫణీంద్ర, లక్ష్మణ్, మండల శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# తేనెల తెలుగుకు ఉజ్వల భవిష్యత్తు : వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగే పరమపద సోపాన మని, తేనెల తెలుగు ఉజ్వల భవిష్యత్తు ఉందని, న్యూఢిల్లీకి చెం దిన శ్రీ వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు భాషా ప్రాశస్త్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాతృభాష మాటల వారధి మాత్రమే కాదనిముందుకు నడిపే సారథి అని అన్నారు. భాష సజీవం కావాలంటే అందరికీ అర్థమయ్యేలా కొత్త పదాలు సృష్టించుకోవాలని ఇంగ్లీషు లేకపోతే మనుగడలేదు అనే భావదాస్యం పోవాలని, తెలుగు భాషపై పట్టు సాధిస్తే లెక్కకు మిక్కిలి అవకాశాలు వస్తాయని ఇంగ్లీషు లేకపోతే మనుగడలేదు అనే భావదాస్యం పోవాలని అన్నారు.సమితి అధ్యక్షుడు గురు ప్రసాద్ మాట్లాడుతూ అమ్మ పాలతో నరనరాల్లో నిండినదే అమ్మ భాష అని, మనిషికి ఆయువు పట్టు, ప్రాణవాయువు భాష మాత్రమేనని, తెలుగు భాష కీర్తిని హిమాలయ శిఖరాగ్రాన నిలిపిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని, అలాంటి పవిత్రమైన మధురమైన భాషను ముందు తరాలకు వారసత్వంగా అందజేయడం అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనివాసమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సమితి సలహాదారు ముళ్ళపూడి సుభద్ర దేవి, జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ ఎం వి ఆర్ కృష్ణాజీ, పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్య డిగ్రీ, పీజీ కాలేజ్ కరాటే విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు







**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ మరియు పీజీ కాలేజ్‌లో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు, కోచ్ శ్రీ సంతోష్ మార్గదర్శకత్వంలో, ఇటీవల విశాఖపట్నం గాజువాకలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 31వ కెన్యూ ర్యో కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో విజయాలు సాధించారు. ఈ పోటీలు ఫిబ్రవరి 21 మరియు 22 తేదీల్లో జరిగాయి. కాలేజ్‌కు చెందిన బాలురు మరియు బాలికలు కాటా మరియు కుమిటే విభాగాల్లో పతకాలు గెలుచుకున్నారు. పతక విజేతల వివరాలు ఇవి: కాటా మరియు కుమిటే విభాగాల్లో పతకాలు సాధించిన వారు: 1. పి.చేతన శ్రీ – కాంస్య పతకం, 2. పి.సాత్విక – కాంస్య మరియు కాంస్య పతకాలు, 3. కె.తనుశ్రీ – కాంస్య మరియు వెండి పతకాలు, 4.ఎన్.జనని – వెండి మరియు కాంస్య పతకాలు, 5. పి.శ్రీ సంతోషి – కాంస్య మరియు వెండి పతకాలు, 6. ఎం.యోగిత – కాంస్య మరియు బంగారు పతకాలు, 7. వి.ఇంద్ర ప్రియా ధర్షిణి – కాంస్య మరియు వెండి పతకాలు, 8. ఎస్.నవ్య – వెండి మరియు వెండి పతకాలు, 9. చి. రిషిత – కాంస్య మరియు వెండి పతకాలు, 10. చి. పాన్వి ప్రజ్వల్ – వెండి మరియు వెండి పతకాలు, 11. పి. గురుసిద్ధిక్ – కాంస్య మరియు కాంస్య పతకాలు, 12. పి. గగన్ సాయి – వెండి, వెండి పతకాలు, 13. ఎన్. మహీధర్ – బంగారు, కాంస్య పతకాలు, 14. ఎస్. శ్రీ వత్సల్ – కాంస్య పతకం, 15. పి.హర్షవర్ధన్ – కాంస్య మరియు కాంస్య పతకాలు, 16. మొహమ్మద్ సమీర్ అహమ్మద్ – కాంస్య మరియు కాంస్య పతకాలు, 17. కె.శివ గణేష్ – కాంస్య మరియు బంగారు పతకాలు, 18. పి.కుశ్వంత్ కుమార్ – బంగారు మరియు బంగారు పతకాలు, 19. కె. ప్రేమేష్ – వెండి మరియు బంగారు పతకాలు. ఈ సందర్భంగా సత్య కాలేజ్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ డా.ఎం.శశి భూషణ రావు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో ఇంకా మంచి విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ కెప్టెన్ ఎం.సత్యవేణి, కోచ్ కె.సంతోష్ కుమార్ మరియు అసిస్టెంట్ కోచ్ భార్గవ్ పాల్గొన్నారు.

# తొలేళ్లతో ప్రారంభమైన మరుపల్లి ఎల్లమ్మ జాతర



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మరుపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర మంగళవారం తొలేళ్ల ఉత్సవంతో ప్రారంభమైంది. ఈ ఉత్సవములో భాగంగా తొలి రోజు వీధుల్లో అమ్మవార్లు తిరుగాడగా భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బుధవారం జరగనున్న సిరిమానోత్సవం ఘనముగా నిర్వహించేందుకు నిర్వాహకులు, సర్పంచ్ లెంక రామలక్ష్మి, గ్రామ కార్యదర్శి మంత్రి రమణ ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు.

# పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ వేగవంతం కావాలి

## - గడువులోగా రీసర్వే, ఈ-కేవైసీ ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశం






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రీసర్వే త్వరగా పూర్తి చేయాలని, ఈ ప్రక్రియ సాగుతున్న గ్రామాల్లో ఉప తహసిల్దార్లు, సర్వేయర్ల డిప్యూటేషన్లు ఏవైనా ఉంటే వాటిని వెంటనే రద్దు చేయాలని రెవిన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మితో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సర్వేయర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందాలని, ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో సానుకూల ఫలితాలు వచ్చేలా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రీసర్వే ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకూడదని, నిర్దేశించిన గడువులోగా రీసర్వే మరియు ఈ-కేవైసీ ప్రక్రియను శత శాతం పూర్తి చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చేలా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మరియు తదుపరి సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో పాటు, జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇ. మురళి, ఆర్డీవోలు, మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు సారథి అమలుకు కార్యాచరణపై సమీక్ష : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగరంలో చేపట్టబోతున్న ప్రాజెక్టు సారథి (SARTHI – సిస్టమేటిక్ ఆగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్) అమలుకు సంబంధించి కార్యాచరణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సిటీ ఆపరేషన్ సెంటర్‌నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీతో, టెండర్‌నందు పాల్గొన్న బిడ్డరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్కును నియంత్రిం చేందుకు ప్రాజెక్టు సారధిని అమల్లోనికి తీసుకు రావడం జరుగుతున్న నేపథ్యంలో ఐటీఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టం) ను 90 జంక్షన్‌లలో ఏర్పాటు చేసేందుకు, ATCS – అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టంను 101 జంక్షన్‌లలో సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు అనుసంధానం చేసేందుకు టెండర్లను ఆహ్వానించడం జరిగిందన్నారు. టెండర్లలో ముగ్గురు ఏజెన్సీలు పాల్గొనగా ప్రీ క్వాలిఫికేషన్‌కు అర్హులయ్యారన్నారు. తదుపరి టెండర్ ప్రక్రియలకు సంబంధించి మూడు ఏజెన్సీలకు ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ చేసేందుకు మూడు జంక్షన్‌లను నిర్వహణకు సూచించడం అయినదన్నారు. ఈ నిర్వహణకు సంబంధించి బిడ్డర్ల తదుపరి దశను మంజూరు చేసేందుకు గాను తదుపరి చర్య కోసం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఫైనాన్స్ ఎస్ ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీర్ పి వి వి సత్యనారాయణరాజు, వి ఎం ఆర్ డి ఏ ప్రధాన ఇంజనీరు వినయ్ కుమార్, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు ఏడుకొండలు, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ దుర్గారాణి, పబ్లిక్ హెల్త్ పర్యవేక్షక ఇంజనీర్ కామేశ్వరరావులతో కలిసి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడమైనదన్నారు. ముగ్గురు ఏజెన్సీలు పొందుపరిచిన వివరాలను, సాంకేతిక ప్రదర్శనను సిటీ ఆపరే షన్స్ సెంటర్‌నందు ఏర్పాటు చేసిన కమిటీ నేడు తిలకించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. టెండర్లు మంజూరు అనంతరం ప్రాజెక్టు సారథి ద్వారా నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు, వాహనాల రాకపోకలకు వీలుగా ఏటిసిఎస్ సిస్టం 101 జంక్షన్‌లలో అమలు చేయడం జరుగునన్నారు. ఈ సిస్టం ద్వారా ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా గ్రీన్ సిగ్నల్ ఆటోమేటిక్‌గా ఇండికేట్ అవుతుందన్నారు. అలాగే వీఐపీ రాకపోకలప్పుడు ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా గ్రీన్ సిగ్నల్ వచ్చేలాగా సిఓసి ద్వారా ఆపరేషన్ కూడా జరుగుతుందన్నారు. అలాగే ఎఐ బేస్డ్ ఐటీఎంఎస్ సిస్టం 90 జంక్షన్లో ఏర్పాటు చేస్తున్నామని, ఏ ఎన్ పి ఆర్ & ఆర్ ఎల్‌విడి కెమెరాల ద్వారా ట్రాఫిక్ వైలేషన్ డిటెక్షన్ చేసి ఆటోమే టిగ్గా ఫైన్ ఇంపోజ్‌కు సంబంధించి చలానా జనరేట్ చెంది వాహన యజమానికి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, వివిఎమ్ఆర్డిఏ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, జీవీఎంసీ పరివేక్షక ఇంజనీర్ ఏడుకొండలు, ట్రాఫిక్ సిఐ నరసింహారావు, ఏయూ ప్రొఫెసర్ దుర్గారాణి, కెవిన్ రవి, తదితరులు పాల్గొన్నారు.

# సహకార ఉద్యమం ఉధృతం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుండి నిర్వహిస్తున్న రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం సామర్లకోట బ్రాంచ్ సహకార సంఘం ఉద్యోగులు, పెద్దాపురం బ్రాంచ్ సహకార సంఘం ఉద్యోగులు సామర్లకోట బ్రాంచ్ వద్ద నిరసన చేపట్టారు. రెండు బ్రాంచ్ల సిబ్బంది కలిపి చేపట్టిన నిరసన ఎనిమిదవ రోజుకు చేరిన సందర్భంగా వారి డిమాండ్ల సాధన కొరకు ఈ సమ్మె విరమించేది లేదని సామర్లకోట బ్రాంచ్ డైరెక్టర్ కోరాడు మారుతి బాబు, పెద్దాపురం బ్రాంచ్ డైరెక్టర్ గుణం వీర వెంకట సత్యనారాయణలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మేడపాడు పిఎసిఎస్ సిబ్బంది, సామర్లకోట పిఎసిఎస్ సిబ్బంది, అచ్చంపేట పిఎసిఎస్ సిబ్బంది, పెద్ద బ్రహ్మదేవం పిఎసిఎస్ సిబ్బంది, వికేరాయపురం పిఎసిఎస్ సిబ్బంది, ఉండూరుపిఎసిఎస్ సిబ్బంది, ఇంకా పెద్దాపురం బ్రాంచ్ పరిధిలో గల ఆర్బి పట్నం పిఎసిఎస్ సిబ్బంది, కాండ్రకోట పిఎసిఎస్ సిబ్బంది, కట్టమూరు పిఎసిఎస్ సిబ్బంది, వీరవరం పిఎసిఎస్ సిబ్బంది పాల్గొని వారి నిరసన తెలిపారు.

# ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ గ్రామంలో బీసీ కాలనీయందు కొలువైయున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ తృతీయ వార్షికోత్సవం మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. మొదటిగా శ్రీ అభయాంజనేయ స్వామి వారికి మక్కువ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు చేతుల మీదుగా తొలి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రంగు నాయుడు గారు చేతుల మీదుగా భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించి భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమ కమిటీ సభ్యులు మరియు వైఎస్ఆర్సిపి యువత బిసి కాలనీ ప్రజలు ముందుండి నడిపించారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం : డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు. 32వ వార్డు అల్లిపురం మార్కెట్ ప్రాంతంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉద్యోగులు, స్థానికులతో ఆయన స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పర్యటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగ మించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడ పచ్చదనం పరిఢవిల్లితేనే సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెనుభూతంలాంటిదని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావిత రాలకు పెనుముప్పు తప్పదని హెచ్చరించారు. సుసంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రంలోని 10 సూత్రాల్లో సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర అనేది ఒక సూత్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్తో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాలి కాలుష్యం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థ, సౌర విద్యుత్ వినియోగం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణహిత మార్గంలో సాగించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎస్ఐ కీర్తి, సెక్రటరీలు శశి బాల, పవన్, ప్రసాద్, దివ్యశ్రీ, వార్డు మేస్త్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు లేని ప్రజా వేదికలు...

# వెలవెలబోయిన సామాజిక తనిఖీ గ్రామ సభ




**కాజులూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం అప్పులు చేసి తెస్తున్న కోట్లాది రూపాయలు ఏమవుతున్నాయో తెలియనట్టే గ్రామాలలో అడపా దడపా జరుగుతున్న పలు అభివృద్ధి పనులు స్థానిక ప్రజాప్రతినిదులకు, ప్రజలకు తెలియకుండా గోప్యంగా జరిగిపోతున్నాయి. ఇటీవల గ్రామాలలో జరుగుతున్న పలు రోడ్డు నిర్మాణాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రజలు అడిగినప్పటికీ ఇస్టిమేట్ కాపీలు చూపించకుండా నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి అధికారులు వ్యవహరించిన తీరు పలు విమర్శలకు దారి తీయగా స్థానిక ప్రజాప్రతినిదులకు ప్రజలకు సరైన సమాచారమివ్వకుండా మంగళవారం తూతూమంత్రంగా నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు విమర్శలకు వేదికయ్యింది. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు సంబందించి ఆయా గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలలో చర్చించిన అంశాలపై మంగళవారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమంలో డ్వామా పీడి అడపా వెంకటలక్ష్మీ, ఎంపీడిఓ జే.రాంబాబు, ఉపాధి హామీ పిడి ఓబి వెంకటలక్ష్మీ పాల్గొన్నప్పటికీ మండల స్థాయి అధికారులెవ్వరూ హాజరు కాలేదు. ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవటంతోపాటు సంబంధిత ఉపాది కూలీలు సైతం హాజరు కాకపోవటంతో సభ వెలవెలబోయింది. కనీసం గ్రామాలలో ఆ శాఖకు బాధ్యత వహించే ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం అలా వచ్చి ఇలా వెళ్ళిపోవటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుర్చీలని ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇటు ప్రజలకు, అటు ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం అందజేయకుండా ఈ సమాజిక తనిఖీ నిర్వహించారని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా స్థానికంగా గ్రామాలలో నిర్వహించిన గ్రామ నదలలో సైతం ప్రజాప్రతినిధులకు, ప్రజలకు సరైన సమాచారమివ్వకుండా తూతూమంత్రంగా నిర్వహించారని పలువురు సర్పంచ్లు, ఎంపీటిసిలు ఆరోపిస్తున్నారు.

# మరిడమ్మ అమ్మవారి మొక్కులు పొందే హక్కుకు వేలం పాటలు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం భక్తులు అమ్మవారికి సమర్పించే మేకలు, కోళ్ళు, ఏనుబోతులు అమ్ముకోను, తీసుకోను హక్కు 1 సంవత్సరమునకు గానూ రూ. 11,18,611 లభించింది. అలాగే భక్తులు అమ్మవారికి సమర్పించే తలనీలాలు తీసుకోను, ప్రోగు చేసుకోను హక్కునకు రెండు సంవత్సరాలకు గాను మొదటి సంవత్సరం రూ. 44,000, రెండవ సంవత్సరం 10 శాతం హెచ్చుపై రూ. 48,400 చెల్లించే విధంగా ఆధాయం వచ్చింది. ఈ వేలం పాటలకు శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఈవో కె జగదీశ్వరరావు, ఆలయ చైర్మన్ పర్యవేక్షణలో జరిగినట్టు దేవాదాయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణధికారిణి కె విజయలక్ష్మి తెలిపారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహామాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్స్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# కొరిపల్లెలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

## - ఇంటింటి చెత్త సేకరణపై డిప్యూటీ ఎంపీడీవో పరిశీలన




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో కొరిపల్లె గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు.

అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరచాలని సూచిం చారు. అట్టపెట్టెలు, ప్లాస్టిక్ బాటిల్స్, పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులు గ్రామంలో స్వచ్ఛ రథం వచ్చినప్పుడు అందజేస్తే అవి తీసుకుని నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఇలా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడినట్టవుతుందని తెలిపారు. చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం వల్ల పునర్వినియోగ అవకా శాలు పెరుగుతాయని పేర్కొన్నారు. చెత్త నుండి సంపద కేంద్రా లను సందర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కేంద్రాల ద్వారా తయారయ్యే కంపోస్ట్ ఎరువులు నర్సరీలు, వ్యవ సాయం తదితర అవసరాలకు ఉపయోగించవచ్చని, అలా చేయ డం ద్వారా పంచాయితీ ఆదాయం కలుగుతుందని వివరించారు. గ్రామాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసర మని, శుభ్రమైన గ్రామాల ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వేటపాలెం రైస్ మిల్లులో జెసి విస్తృత తనిఖీలు

## - గుర్తించిన లోపాలపై సివిల్ సప్లై ఎండికి నివేదిక




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ రైస్ మిల్లులో మంగళవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లులో లోపాలను గుర్తించేందుకు గానూ జేసి సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం దేవులా నాయక్, తహశీల్దార్ కె చంద్రశేఖర్ రెడ్డి, మండల సివిల్ సప్లై అధికారి ఆర్ ఎస్ ఎస్ సత్యనారాయణల సమక్షంలో ఈ తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. రైస్ మిల్లులో ఉన్న బియ్యం, దాన్యం నిల్వలను జేసి స్వయంగా లెక్కించి దానికి సంబందించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఆయన రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టారు. అనంతరం మిల్లు రికార్డులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేసారు. అక్కడ రికార్ధులను నిసిదంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు లోపాలను అధికారులు గుర్తిం చారు. దానిపై నివేదిక తయారుచేసి సివిల్ సప్లై ఎండికి అందజేయనున్నట్టు జేసీ చెప్పారు. ఈ తబిఖీలో రెవెన్యూ, సివిల్ సప్లై సిబ్బంది, విఆర్వోలు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులకు వినూత్న అవగాహన కార్యక్రమం

## - నిరంతర సాధనతోనే నాణ్యమైన వైద్యం : బొండా సూర్యారావు

**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో గ్రామీణ వైద్యులు (ఆర్ఎంపీలు, పీఎం పీలు), కెమిస్టులు, ల్యాబ్ నిర్వాహకులతో మంగళ వారం వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన నైపుణ్యాలపై నిపుణులు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాకినాడలోని సన్‌రైజ్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ ఎముకల వ్యాధుల నిపుణుడు డాక్టర్ బోండా సూర్యారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నారని తెలిపారు. నిరంతర సాధన, అవగాహన తరగతులు ద్వారా వైద్యులు తమ సేవలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రముఖ శిశు, మధుమేహం మరియు స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ అపర్ణ పసుపులేటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి స్థాయి వైద్య సేవలందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రతి వారం రెండు రోజులపాటు కరపలోని శ్రీలక్ష్మి భావ్య క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం త్వరలో పారామెడిక్స్ శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాధనల శ్రీనివాస్‌రావు, మెడికల్ ప్రాక్టీషనర్స్ శ్రీనివాస్, సుధాకర్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైస్ ఎంపీపీ పాటినీడి భీమన్న, గొర్రెల వెంకన్న, తణుకురాజు తదితరులు పాల్గొన్నారు.

# వేళంగిలో ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమ య్యాయి. వేళంగి కళాశాలతో పాటు కరప ప్లస్ టు విద్యార్థులు కలిసి మొత్తం 77 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేశారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను కరప పోలీస్ స్టేషన్ నుంచి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి తరలించారు. మొత్తం 78 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. ఒకరు గైర్హాజరు కావడంతో 77 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.వాణి తెలిపారు. పరీక్ష కేంద్రంలో క్రమ శిక్షణతో పాటు కట్టుదిట్టమైన నియమాలు అమలు చేశారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అను మతి ఇవ్వబోమని ముందుగానే అధికారులు ప్రక టించిన విషయం తెలిసిందే. విద్యార్థులు సమయా నికి ముందే కేంద్రానికి చేరుకుని ప్రశాంతంగా పరీక్ష రాశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan